సాక్షి
ప్రకాశం
గురువారం । 15 । ఆగస్టు । 2024



సాహో.. సమరయోధులారా..

స్వతంత్ర్యోద్యమంలో అలుపెరుగని పోరుసల్పి అశువులు బాసిన యోధులెందరో ఉన్నారు. తెల్లదొరల దాష్టీకంపై గళమెత్తి పోరాడిన వీరులకు జిల్లాలో కొదువలేదు. నాటి వీరుల త్యాగాలను స్మరించుకుంటూ 'సాక్షి' ప్రత్యేక కథనం.

- IIలో..

గరిష్టం/కనిష్టం
35/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు..

■ ఇతని పేరు బొమ్మల చిన్న అంజయ్య. వయసు 60 ఏళ్లు. మద్దిపాడు గడియపూడి కాలనీలో నివాసం ఉంటాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రోడ్డు ప్రమాదంలో కాలు తీసేశారు. ఆపరేషన్ చేసిన చోట ఇబ్బంది ఉందని చూపించుకునేందుకు వచ్చాడు. రక్త పరీక్షలు చేయించుకొని ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. ల్యాబ్‌కు వెళ్లేందుకు వీల్ చైర్ కోసం చూశాడు. అందుబాటులో లేకపోవడంతో కనీసం సహాయకుల కోసం ఎదురు చూశాడు. ఎవరూ లేకపోవడంతో స్టాండు ఆసరాగా అతి కష్టం మీద నడుస్తూ ల్యాబ్‌కు బయలుదేరాడు.





ఒంగోలు రిమ్స్‌లో ఓపీ కోసం గంటల తరబడి క్యూలో నిలబడిన రోగులు

సర్వజన.. వైద్య వేదన

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి (రిమ్స్)కి నిర్లక్ష్యపు జబ్బుచేసింది. పాలకులు పట్టించుకోకపోవడంతో రెండు నెలల్లో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. పట్టించుకునేవారే లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వస్తున్న రోగుల అవస్థలు వర్ణనాతీతం. రోగుల వేదన తప్ప రోగం నయమయ్యే మార్గం కనిపించడంలేదు. ఓపీ దగ్గర ప్రారంభమయ్యే కష్టాలు..డాక్టర్ వద్దకు చేరేలోపు ఓపిక నశించిపోతోంది. తీరా డాక్టర్ పరీక్షలు రాస్తే ఇంక అంతే సంగతులు. అత్యవసరంగా చేసే ఎంఆర్‌ఐ, సి.టి. స్కాన్ పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉంది. రిపోర్టులు రావాలంటే రోజుల తరబడి వేచిచూడాల్సిందే. టీఎంటీ పరీక్షకైతే ప్రైవేటు బాట పట్టాల్సిందే. ఇక ఇన్‌పేషెంట్లు, వారి బంధువుల ఇక్కట్లు సరేసరి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. బాత్రూముల్లో నీళ్లు రావు. ఆస్పత్రిలో కుక్కలు హల్‌చల్ చేస్తుండడం ఇక్కడ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 'సాక్షి' పరిశీలనలో వెల్లడైన అంశాలు ఇలా ఉన్నాయి.



ఓపీ వద్ద చోటులేక కిందనే కునుకుపాట్లు



అబా రిజిస్ట్రేషన్ వద్ద రోగుల రద్దీ

ఓపీ దగ్గర నుంచే యుద్ధం మొదలు...

జీజీహెచ్‌లో వైద్యం పొందాలంటే మొదట ఓపీ రాయించుకోవాలి. ఉదయం 9 గంటలకల్లా ఇక్కడ చాంతాడంత క్యూ కనిపిస్తోంది. కొద్ది కాలం నుంచి అబా యాప్ ద్వారా రోగి పేరు రిజిస్టర్ చేస్తారు. రిజిస్టర్ చేయించుకున్న రోగికి ఒక టోకెన్ నంబర్ కేటాయిస్తారు. తరువాత క్యూలో నిలబడి కౌంటర్ దగ్గరకు చేరుకొని టోకెన్ నంబర్ చెబితే ఓపీ ఇస్తారు. మన అదృష్టం బాగుంటే ఓపీ స్లిప్ వస్తుంది. లేకపోతే సర్వర్ డౌన్ అవుతుంది. తిరిగి ఎప్పుడు స్టార్ట్ అవుతుందో తెలియదు. వీట న్నిటినీ తప్పించుకొని వెళ్లి వైద్యుడి వద్ద చూపించుకొని బయట పడడా నికి కనీసం రెండున్నర నుంచి 3 గంటల సమయం పడుతుంది. ఒకవేళ ఓపీ స్లిప్ వచ్చి తీసుకొని డాక్టర్ దగ్గరకు వెళితే అక్కడ కూడా ఒక క్యూ కనిపిస్తుంది. ఓపికగా వేచి ఉండి డాక్టర్ వద్దకు వెళ్లి చూపించు కున్నాక ఆయన కనుక రక్త పరీక్షలు రాస్తే కథ మళ్లీ మొదటికి వస్తుంది. రక్త పరీక్షలు చేయించుకునే సరికి ఒక జీవితకాలం గడుస్తుంది. దాంతో రోగి పనిఅయిపోతుందన్నట్లుగా ఉంటుంది ఇక్కడ పరిస్థితి. ఇది సాధారణ చికిత్స కోసం వచ్చే రోగుల పరిస్థితి. అదే ఏ ఆపరేషన్ కోసమో వస్తే మాత్రం ఎంత పరేషాన్ పడాల్సి వస్తుందో చెప్పలేం. మూడంతస్తుల ఈ ఆస్పత్రిలో పైకి కిందకు తిప్పడంతో రోగులు విసిగె త్తిపోతున్నారు.



డాక్టర్ గది వద్ద క్యూలో బారులుతీరిన రోగులు

- రెండు నెలల్లోనే మారిన వైద్య సేవలు
- రోగులను పట్టించుకునే దిక్కే లేదు
- రోగి బంధువులే స్ట్రెచ్చర్ బేరర్లు
- సకాలంలో వైద్యం అందక అవస్థలు
- ఓపీ దగ్గర నుంచే తిప్పలు ప్రారంభం
- వారం తిరిగితేనే కానీ చేతికి రాని ఎంఆర్‌ఐ, సి.టి. స్కాన్ పరీక్ష రిపోర్టులు
- ఒంగోలు రిమ్స్‌పై 'సాక్షి' విజిట్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు
ఒంగోలు టౌన్/ఒంగోలు అర్బన్:

జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్ప త్రికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ప్రతి రోజు 800 మంది నుంచి 1000 మంది వరకు వస్తుంటారు. అత్యవసర కేసులు ప్రతి రోజూ 150 వరకు ఉం టాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. సీరియస్ కేసులు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులు కూడా ఒంగోలు జీజీహెచ్‌కు వస్తుంటాయి. ఎప్పుడు చూసినా రద్దీగా కనిపిస్తుంది. రోగులు, వారి కుటుం బ సభ్యులతో కిటకిటలాడుతూ ఉంటుంది. అంతకు ముందు వైద్యుల కొరత, మందుల కొరతతో నిర్ల క్ష్యానికి గురైన ఈ రిమ్స్ వైద్యశాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత రూపురేఖలను మార్చేశారు. రోగులకు అవసరమైన మందులు, రోగ నిర్ధారణ కోసం అత్యంత ఆధునిక వైద్య పరికరాలను సమకూ ర్చారు. స్పెషలిస్టు వైద్యులను కూడా నియమించడం తో ఇక్కడ మెరుగైన వైద్యం లభిస్తుందన్న నమ్మకం తో ప్రజలు, ముఖ్యంగా నిరుపేదలు వైద్యం కోసం ఇక్కడకు రావడం మొదలు పెట్టారు. అందుకు తగి నట్లుగానే గత ఐదేళ్లుగా ఇక్కడ వైద్య సేవలు అం దాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో పరిస్థితి రివర్స్ అయిం ది. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కేవలం రెండు నెలలోనే పెద్దాస్పత్రిలో పాత కథ మొదలైంది. పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఇక్కడకు వచ్చి వైద్యం చేయించు కోవాలంటే రోగులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యం కోసం వచ్చిన రోగులు గం టల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోంది. సకాలం లో వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన సెక్యూరిటీ లేకపోవడంతో ఆస్పత్రిలో కుక్కలు సైతం హల్‌చల్ చేస్తున్నాయి. పరీక్షలు నిర్వహించే ల్యాబుల్లోకి సైతం చొరబడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నడవలేని స్థితిలో వచ్చిన రోగులను తీసుకెళ్లేందుకు సరిపడా స్ట్రెచర్లు, వీల్ చైర్లు లేకపోవడంతో పేషంట్లు గంటల తరబడి ఎదు రుచూడాల్సి వస్తోంది. వీరి కోసం ఏర్పాటు చేసిన వాహనం మూలనపెట్టేశారు.



పనిచేయని మంచినీటి పథకం, అపరిశుభ్రంగా పరిసరాలు



మూలనపడిన బ్యాటరీ వాహనం



అల్ట్రాసౌండ్ స్కానింగ్ వద్ద పేషెంట్స్ రద్దీ

ఎమ్మారై రిపోర్టుల కోసం ప్రదక్షిణలు..

రోడ్డు ప్రమాదాలు, పక్షవాతం, బ్రెయిన్‌లో బ్లడ్ క్లాటింగ్, గర్భసంచి సమస్యలు, వెన్నుముక, మెడకు సంబంధించిన సమస్యలలో ఎంఆర్‌ఐ, సి.టి. స్కాన్ పరీ క్షలు అత్యంత కీలకమైనవి. ఇంత అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మారై, సి.టి. స్కాన్ చేస్తున్నారు. అయితే రిపోర్టులు ఇచ్చే విషయంలో పూర్తి జాప్యం జరుగుతోంది. ఎమ్మారై తీయించుకున్న వారం పది రోజుల తరువాత రిపోర్టు ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. దీంతో పుణ్య కాలం కాస్త గడిచిపోతుంది. కొన్ని సందర్భాల్లో రోగి మరణించాక రిపోర్టులు ఇస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. సి.టి. స్కాన్ సం గతి కూడా అంతే. స్కానింగ్ తీసుకున్న తర్వాత ఫిల్మ్‌లు చేతికి ఇచ్చి మీ డాక్టర్‌కు చూపించండి. రిపోర్టు అయనే చెబుతాడంటూ రేడియాలజీ సిబ్బంది సమా ధానం ఇస్తుంటారు.

అడ్మిషన్ అయిన తరువాత అసలు కథ షురూ..

ఏదైనా ఆరోగ్య సమస్యతో జీజీహెచ్‌లో అడ్మిట్ అయిన తరువాత పేషంట్‌తో పాటుగా అతడి కుటుంబ సభ్యుల కష్టాలు అన్నీ, ఇన్నీ కావు. వార్డులో ఒకటి ఉంటే మరొకటి ఉండదు. వైద్యుడు ఉంటే నర్సు వుండరు. ఇద్దరూ ఉంటే మనకు కావా ల్సిన మందులో, కట్టుగుడ్డలో ఉండవు. ఇవన్నీ ఒక ఎత్తయితే పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మరుగుదొడ్లు, బాత్‌రూంలలో నీటి సరఫరా ఉం డదు. నీటి పైపులు ఉంటాయి కానీ అందులో నీరుండదు. రోగితోపాటు వచ్చిన కుటుంబ సభ్యులు కనీస అవసరాలను తీర్చుకునేందుకు ఎక్కడకి వెళ్లాలో తెలియక నానా ఇబ్బందులు పడు తున్నారు. రోగులను పారిశుధ్య లోపం బాగా ఇబ్బంది పెడుతోంది. ఏ వార్డులో చూసినా పారి శుధ్య లోపంతో తీవ్రమైన దుర్వాసన వస్తోంది. రెం డో అంతస్తులోని మంచినీటి ట్యాంకు, మూడో అం తస్తులో ఎమర్జెన్సీ వార్డు వద్ద ఉన్న ట్యాంకుల నుం చి నీరు సరఫరా కావడం లేదు. దాంతో మంచినీటి కోసం బయటకు వెళ్లి కొనుక్కొని తెచ్చుకోవాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు.

పనిచేయని టీఎంటీ...

గుండె జబ్బులు ఎక్కువగా కనిపిస్తున్న ఈ రోజుల్లో టీఎంటీ పరీక్ష కీలకమని కార్డియాలజీస్టులు చెబుతున్నారు. కానీ జీజీహెచ్‌లో రెండు నెలలుగా టీఎంటీ పనిచేయడం లేదని తెలిసింది. ఉన్న యం త్రం కూడా పాతది కావడంతో రెండు రోజుల కోసారి చెడి పోతుందని, మాటి మాటికీ మూలన పడుతోందని రోగులు వాపోతున్నారు. టీఎంటీ పరీక్ష కోసం రోగులను ప్రైవేటు వైద్యశాలలకు పం పిస్తున్నారు. 2డీ ఎకో పరికరం కూడా చెడిపోయిం దని, అధికారులు పట్టించుకోకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ రెండు పరీక్షల కోసం ప్రైవేటు వైద్యశాలలకు వెడితే మిగతా పరీ క్షలు చేయకుండా ఈ పరీక్షలు చేసేపరిస్థితి లేదు. రూ.500లతో ఓపీ, ఇతర పరీక్షలతో కలిపి టీఎంటీ, 2డి ఎకో చేస్తున్నారని. అందుకు రూ. 5 వేల వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు. జీజీహెచ్‌కు వచ్చే రోగుల్లో నిరుపేద సామాన్య రోగులే ఎక్కువగా ఉం టారు. వేల రూపాయలు ఖర్చు చేసే స్థోమత లేక పోవడంతో వైద్యం మానుకొని ఇంటికి తిరుగు ముఖం పడుతున్నారు. ఆస్పత్రిలోని జనరల్ మెడి సిన్ వద్ద ఏర్పాటు చేసిన ఈసీజీ తరచుగా మొరా యిస్తోంది.

నర్సుల నిర్లక్ష్య వైఖరితో ఇక్కట్లు:

జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. విధులు సక్రమం గా నిర్వహించడం లేదని, రోగులతో చిరాకుగా మాట్లాడడం, రోగులతో వచ్చిన అటెండెన్స్‌తో వాదనలకు దిగడం, తరచుగా ఘర్షణ పడడం జరు గుతున్నాయి. ఇటీవల పేషంటుకు తోడుగా వచ్చిన పేషంట్ భార్యపై సిబ్బంది దాడికి దిగడం సంచ లనం సృష్టించింది. డ్యూటీల విషయంలో కూడా స్టాఫ్ నర్సులు ఎంఎన్‌ఓ, ఎఫ్ఎంఓలతో తరచుగా వాదనలు పెట్టుకుంటున్నారని సమాచారం. నర్సులు చేయాల్సిన పనిని ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓల చేత చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇరువురి మధ్య రోగులు నలిగిపోతున్నారు.

మెడికల్ కళాశాలల్లోనూ సమస్యలే..

మెడికల్ కళాశాలలోని వసతి గృహంలో అప్పటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌కు మంచినీటి సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో విద్యార్థులు మంచినీటి సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారు. బయట నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. హాస్టల్ వద్ద సెక్యూరిటీ అంతంత మాత్రంగానే ఉంది. పీజీ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సమ కూర్చాల్సిన అవసరం ఉంది. హాస్టల్ విద్యార్థుల కోసం అదనపు భవనాలు నిర్మిస్తున్నారు. రెండు నెల లుగా వీటి పనులు మందగించాయి.



■ ఈ పెద్దాయన పేరు మెరుగుసాల సుబ్బారావు. వయస్సు 70 ఏళ్లు. సొం తూరు కందుకూరు. కళ్లు సరిగా కనిపించడంలేదని కంటి డాక్టర్ దగ్గర చూపించుకునేందుకు భార్యతో కలిసి జీజీహెచ్‌కు వచ్చాడు. కళ్లు పరీక్షించిన వైద్యుడు ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, ఈసీజీ చేయించుకొని రమ్మని పంపించారు. అక్కడ పెద్ద క్యూ ఉండడం తో నిరీక్షిస్తూ కూర్చున్నాడు.

వాటర్ ప్లాంట్‌కు పచ్చ రంగు

ఆస్పత్రికి వస్తున్న రోగులు పడుతున్న అవస్థలు పట్టని అధికార పార్టీ ప్రజాప్రతి నిధులు, ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న వాటర్ ప్లాంట్‌కు మాత్రం పచ్చరంగు పులిమేశారు. దాదాపు ఏడేళ్ల కిందట దామచర్ల ఆంజనేయులు జ్ఞాపకార్థంగా దీనిని ఏర్పాటు చేశారు. అయితే అధి కారంలో ఉన్నన్నాళ్లు దాని నిర్వహణ సైతం పట్టించుకోలేదు. ఎన్నికల ఫలి తాలు రావడమే తరువాయి ఆస్పత్రిలో పనిచేస్తున్న పచ్చపార్టీ అనుకూలరు, పార్టీ నాయకులు వాటర్ ప్లాంట్‌కు పచ్చ రంగు పులిమేశారు.





వైద్యుల గదిలో సంచరిస్తున్న కుక్క

- నాడు పార్టీ మారిన కార్పొరేటర్లను రాజీనామా చేసి పోటీ చేయాలన్నారుగా?
- మరి మీరు చేసిందేమిటి మేయరు గారూ..
- వారికో నీతి...మీకొక నీతా?
- మేయర్ గంగాడపై వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఆగ్రహం
- గుంపులు...గుంపులుగా టీడీపీలో చేరుతారని జోరుగా ప్రచారం
- ఆ ఇద్దరికి తోడు మరో ముగ్గురు పార్టీ మారిన వైనం
- టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి

మీ సవాలు స్వీకరిస్తారా..?


నిజాయితీ ఉంటే రాజీనామా చేయాలి

మేయర్ గంగాడ విలేకరుల సమావేశంలో మాట్లాడిన క్లిప్పింగ్..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ''ఇతరుల విషయానికి వస్తే ఒక తీరు...తన విషయానికి వస్తే మరో తీరు'' అన్న చందంగా తయారైంది ఒంగోలు ప్రథమ పౌరురాలు, నగర మేయర్ గంగాడ సుజాత పరిస్థితి. గతంలో పలువురు వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు పార్టీని వీడి టీడీపీలో చేరారు. అప్పట్లో మేయర్ గం గాడ సుజాత వాళ్ల మీద కారాలు మిరియాలు నూరారు. మరి ఇప్పుడేమో అప్పటి నీతులు గాలికొది లేసి...ఆమే స్వయంగా ఉన్నత స్థానాన్ని కల్పించిన వైఎస్సార్ సీపీని వీడి తుర్రుమంటూ టీడీపీలో చేరిపో వడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది మే 4వ తేదీన ఒంగోలులో మీడియా సమావేశం నిర్వహించిన మేయర్ గంగాడ సుజాత పలువురు కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లతో కలిసి పార్టీ మారిన వారిపై చిందులు తొక్కారు. దమ్ముంటే వైఎస్సార్ సీపీకి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి టీడీ పీలోకి వెళ్లాలని సవాలు విసిరారు. మరి ఇప్పుడేమో ఆ సవాలును గాలికి వదిలేసి... తల్లి లాంటి వైఎస్సార్ సీపీని, అవకాశం ఇచ్చి అందలం ఎక్కించిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డిని వదిలేసి ఏ విధంగా పార్టీ మారావంటూ అటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మేయర్ గంగాడ సుజాతపై దుమ్మెత్తిపో స్తున్నారు. అప్పట్లో విసిరిన సవాలును ఇప్పుడు స్వీక రిస్తావా అంటూ నిలదీస్తున్నారు. గతంలో మీరు మీడియా సమావేశం నిర్వహించి కార్పొరేటర్లు అమ్ముడు పోయారు అన్నావు... మరి ఇప్పుడు మీరు ఎంతకి అమ్ముడు పోయారంటూ వైఎస్సార్‌సీపీ నాయ కులు విమర్శిస్తున్నారు.

పదుల సంఖ్యలో అని జోరుగా ప్రచారం...

వైఎస్సార్‌సీపీ నుంచి పదుల సంఖ్యలో కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నారని వారం రోజులుగా టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ వచ్చారు. నగర మేయర్ గంగాడ సుజాతతో పాటు డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో వైఎస్సా ర్‌సీపీని వీడి పార్టీలో చేరుతున్నారంటూ టీడీపీ నాయ కులు హోరెత్తించారు. కానీ తుస్సుమంటూ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు మరో ముగ్గురు మాత్రమే టీడీపీలో చేరారు. దీనిపై టీడీపీ కేడర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో, ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన కార్పొరేటర్లకు కూడా వీళ్లతో పాటు టీడీపీ కం డువాలు వేసి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆభాసుపాలయ్యారు. తొలుత భారీగా వస్తున్న వైఎ స్సార్ సీపీ కార్పొరేటర్లను ఒంగోలులోనే భారీ ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేసి పార్టీలోకి చేర్చుకోవాలని దామచర్ల భావించారు. అనుకున్న స్థాయిలో రాకపోయేసరికి ఒంగోలులో అయితే పరువు పోతుం దని తన స్వగ్రామం నాయుడుపాలెం పిలిపించుకొని మరీ పార్టీ కండువాలు వేసి మమ అనిపించారు

ఎందుకీ అత్యుత్సాహం?

దర్శి: ఆమె ప్రజాప్రతినిధి కాదు..కనీసం వార్డు మెంబర్ కూడా కాదు. కానీ అధికారులంతా ఆమెకు జీ హుజూర్ అంటూ సాగిలపడుతున్నారు. ఎందుకం టే ఆమె అధికార పార్టీకి చెందిన నాయకురాలు. వివరాల్లోకి వెళితే..దర్శిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నగర పంచాయతీ కమిషనర్ మహేష్ , టీపీఓ వెంకట్రావులు పట్టణంలో విద్యార్థు లతో కలిసి తిరిగారు. ర్యాలీలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ఫ్లెక్సీలో అధికారులు ప్రోటోకాల్‌కు పాతరేశారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని టీడీపీ కార్యక్రమంలా టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఫొటో వేసి..ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఫొటో ఫ్లెక్సీలో వేయక పోవడంతో కమిషనర్ ప్రభుత్వ అధికారా..? లేకా టీడీపీ నాయకుడా అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎటువంటి హోదా లేని గొట్టిపాటి లక్ష్మి ఫొటో ఎం దుకు వేశారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కమిషనర్‌ను వివరణ కోరగా..తాను ఫ్లెక్సీ చూడలేదని సమాధానం ఇవ్వడం గమనార్హం.



గొట్టిపాటి లక్ష్మి ఫొటోతో ర్యాలీ నిర్వహిస్తున్న నగర పంచాయతీ కమిషనర్

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు పూర్తి



సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో గురు వారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన వేదికతో పాటుగా కవాతు నిర్వహించే పరిసరాలు, స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రాం తాన్ని అధికారుల దగ్గరుండి శుభ్రం చేయించారు. పోలీసు అమరవీరుల స్థూ పాన్ని అలంకరించి సిద్ధం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులను వివ రిస్తూ శకటాలు ప్రదర్శించనున్నారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నీ రకాల ఏర్పాట్లు చేశారు. బుధవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ అడిషనల్ ఏఎస్పీ (క్రైం) ఎస్పీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబులతో కలిసి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. పరేడ్ గ్రౌండ్‌ను సందర్శిం చిన ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీసు కవాతు రిహార్సల్ నిర్వహించారు. రిహార్సల్‌లో భాగంగా సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ప్రత్యేక వాహనంపై వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శ నను పరిశీలించి కవాతు నిర్వహించడంతో కొన్ని సూచనలు చేశారు.

సాహో సమరయోధులారా..



సమరయోధుల పోరాట బలం.. అమర వీరుల త్యాగఫలం.. బ్రిటిష్ పాలకులపై ఘన విజయం.. సామ్రాజ్యవాద సంకెళ్ల నుంచి భరతమాతకు విముక్తి కలిగిన తరుణం.. మన స్వాతంత్య్ర దినం. స్వేచ్ఛా పోరాటంలో.. గర్జించిన కంఠాలకు.. కణకణమండిన కళ్లకు.. బిగించిన పిడికిళ్లకు.. రక్తం చిందించిన దేహాలకు.. అలుపెరగని పోరుసల్పి అశువులు బాసిన యోధులకు 'సాక్షి' సలాం.

గన్ను గురిపెట్టినా వెన్ను చూపకుండా గర్జిస్తూ ముందుకు దూకిన కొదమ సింహాలు, తెల్లదొరల దాష్టీకంపై కలం ఝులిపించిన వీరులకు జిల్లాలో కొదవ లేదు. పౌరుష ప్రతాపాలకు పెట్టింది పేరైన ప్రకాశం జిల్లాలో సాగిన ఉద్యమాలు స్వాతంత్య్ర సమరంలో తెలుగోడి సత్తాను దేశానికి చాటిచెప్పాయి. ఈ గడ్డ నాటి స్వాతంత్య్ర పోరాటంలో దేశానికే మార్గనిర్దేశం చేసింది. గురువారం పంద్రాగస్టు సందర్భంగా స్వాతంత్య్ర సమర యోధులపై ప్రత్యేక కథనం..

– సాక్షి ప్రతినిధి, ఒంగోలు/కనిగిరి రూరల్/మార్కాపురం/కొత్తపట్నం/పెద్దదోర్నాల/సింగరాయకొండ

దేశానికి ఆదర్శం దేవరంపాడు ఉప్పు సత్యాగ్రహం

ఆంగ్ల ప్రభుత్వం ఉప్పుపై విపరీతమైన పన్ను భారాన్ని మోపడంతోపాటు ఉప్పు మడుల్లోకి అనుమతిలేనిదే ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దీంతో ఉప్పు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 1930 మార్చి 12న గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుంచి దండి వరకు గాంధీ పాదయాత్ర నిర్వహించారు. ఈ స్ఫూర్తితో జిల్లాలోని అమ్మనబ్రోలు, కనపర్తి, వాడరేవు తదితర ప్రాంతాల్లో ఉప్పు సత్యాగ్రహం తీవ్రస్థాయిలో జరిగింది. కరవది మహిళలు మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఉప్పు సత్యాగ్రహంలో పాలుపంచుకున్నారు. కరవది మహిళలు పోలీసులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. కనపర్తిలో నాణ్యమైన ఉప్పు నిల్వ చేసే ప్రభుత్వ గోడౌన్లపై సత్యాగ్రహులు దాడి చేశారు. అక్కడికి సమీపంలోని దేవరంపాడులో ప్రకాశం పంతులుకు చెందిన భవనాన్ని వారు శిబిరంగా ఉపయోగించుకున్నారు. జిల్లాలో సాగిన ఉప్పు సత్యాగ్రహం దేశానికే ఆదర్శంగా నిలిచింది. అనంతర కాలంలో టంగుటూరి ప్రకాశం పంతులు దేవరంపాడులోని తన భవనాన్ని, పొలాన్ని ట్రస్టుకు దానం చేశారు. అప్పటి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ తదితర ప్రముఖులు దేవరంపాడులో ఉప్పు సత్యాగ్రహ పోరాటానికి గుర్తుగా 1935 నవంబరు 21న విజయ స్థూపాన్ని ఆవిష్కరించారు.



విజయ స్థూపం



టంగుటూరి ప్రకాశం

గర్జించిన గదర్ వీరులు చెంచయ్య, కాకుమాని



దరిశి చెంచయ్య (ఫైల్)




కాకుమాని వెంకటేశ్వర్లు(ఫైల్)

బ్రిటీష్ పాలకుల నిరంకుశత్వంపై కనిగిరి గదర్ వీరులు గర్జించారు. గదర్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, విప్లవకారుడైన దరిశి చెంచయ్య చిన్ననాటి నుంచే బ్రిటీష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఒంగోలు వచ్చిన చెంచయ్య.. 1905లో వందేమాతర ఉద్యమం, ఆ తర్వాత స్వదేశీ ఉద్యమాలకు ఆకర్షితుడయ్యారు. అమెరికా, కెనడా దేశాల్లోని సిక్కులను, వ్యవసాయ కార్మికులను సమీకరించి 1913లో గదర్ పార్టీని స్థాపించారు. గదర్ అనే పత్రికను కూడా నడిపారు. 36 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎనిమిదేళ్లు జైల్లోనే గడిపారు. 1931–32లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం, దేవాలయ ప్రవేశ ఉద్యమంలో పాల్గొన్నారు. పరిపూర్ణ అనే గిరిజన బాలికను పెంచుకున్న ఆయన స్త్రీ విద్య, హరిజనోద్యమం, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు.

◈ కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలం పెద ఇర్లపాడులోని ఓ నిరుపేద ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన కాకుమాని వెంకటేశ్వర్లు గదర్ పార్టీ వ్యవస్థాపకుడు దరిశి చెంచయ్యతో సన్నిహితంగా మెలిగేవారు. కేసులు ఎదుర్కొని ఏడాదిన్నరపాటు అజ్ఞాతంలో గడిపారు. పెద ఇర్లపాడుకు చెందిన కొందరు వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు బంధించి యల్లమందారెడ్డి ఆచూకీ చెప్పాలని చిత్రహింసలు పెట్టారు. సమాచారం ఇవ్వనని తెగేసి చెప్పడంతో 1950 సెప్టెంబర్ 19న యల్లమందారెడ్డి స్వగ్రామమైన నేరేడుపల్లిలో రాతి కూసానికి కట్టి తుపాకీతో కాల్చి చంపారు.

తెల్లోళ్లను తెగనరికిన ఉయ్యాలవాడ

బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేసి తొలి స్వాతంత్య్ర సమరయోధుడుగా చరిత్రకెక్కిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమకు గిద్దలూరు మండలం కొత్తకోటలోని ఫిరంగి నేటికీ నిదర్శనంగా నిలుస్తోంది. భూమి శిస్తును నేరుగా తమకే చెల్లించాలని బ్రిటీష్ పాలకులు హుకుం జారీ చేసినా.. సీమ ప్రజలు మాత్రం పాలెగాడు జయరామిరెడ్డి దత్త పుత్రుడైన నరసింహారెడ్డికి శిస్తు చెల్లించడం మొదలుపెట్టారు. తమ ఆదేశాలను ధిక్కరించారన్న కారణంతో నరసింహారెడ్డిని బ్రిటీష్ ప్రభుత్వం వెంటాడింది. శిస్తు వసూలు కోసం ఉయ్యాలవాడకు వచ్చిన ఓ అధికారి అనుచితంగా ప్రవర్తించడంతో అతడి తలను నరసింహారెడ్డి తెగనరికారు. కొత్తకోట సమీపంలోని అడవుల్లో జయరామిరెడ్డి నిర్మించిన కోటలో ఉంటూ బ్రిటీష్ సైన్యాన్ని ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలోనే వంట మనిషి ఇచ్చిన సమాచారంతో నరసింహారెడ్డిని బంధించిన బ్రిటీష్ సైన్యం 1847 ఫిబ్రవరి 22వ తేదీన కర్నూలు జిల్లా కోవెలకుంట్లలో గల జుర్రేటి ఒడ్డున రెండు వేల మంది ప్రజల సమక్షంలో ఉరి తీశారు. కొత్తకోట బురుజు, ఫిరంగి నరసింహారెడ్డి పౌరుషానికి ప్రతీకగా నిలిచిపోయాయి.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి



కొత్తకోట వద్ద ఉన్న ఫిరంగి..

ఎగసిన ఉద్యమ కెరటం వీరారెడ్డి

తెల్లదొరల దాస్యశృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కల్పించే పోరాటంలో త్యాగాలు చేసిన వారిలో కైపు వీరారెడ్డి ఒకరు. భూస్వామ్య కుటుంబానికి చెందిన ఈయన అయిన వారిని వదిలేసి, యావదాస్తిని ఉద్యమం కోసం ఖర్చు చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా, పొదిలి తాలూకా మునగపాడు గ్రామంలో 1909 జనవరి 7వ తేదీన కైపు వెంకటపతిరెడ్డి, కోటమ్మ దంపతులకు వీరారెడ్డి జన్మించారు. స్వాతంత్య్ర ఉద్యమం వైపు ఆకర్షితులు కావడంతో ఉన్నత చదువులకు వీరారెడ్డి దూరమయ్యారు. తండ్రితో కలిసి చుట్టు పక్కల గ్రామాలకు గుర్రంపై వెళ్లి పంచాయతీలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడంతో 1941 జనవరిలో అరెస్ట్ అయ్యారు. పొదిలి, కందుకూరు, నెల్లూరు, బళ్లారి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవించారు. జైలు నుంచి మూడు నెలల తర్వాత విడుదలైన వీరారెడ్డి ఊరూరా గ్రామసభలు నిర్వహించి హరికథలు, బుర్రకథల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి స్వాతంత్య్ర పోరాటంలో భాగస్వాములను చేశారు.

మన్యం పులులు హనుమంతు, బయ్యన్న


స్వాతంత్య్ర ఉద్యమంలో పెద్దదోర్నాల మండలం పెద్దచేమకు చెందిన కుడుముల పెద్ద బయన్న(పెద్ద బైలోడు), పూర్వ కర్నూలు జిల్లా కొత్తపల్లికి చెందిన హనుమంతప్ప సాగించిన పోరాటం సమస్త గిరిజనులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. బ్రిటీష్ పాలకులు అటవీ సంపదను కొల్లగొడుతూ, చెంచు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడటాన్ని పెద్ద బయన్న సహించలేకపోయారు. తుమ్మలబైలు గ్రామాన్ని స్థావరంగా చేసుకుని బ్రిటీష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడారు. ఈ క్రమంలో ఆంగ్లేయులు తుమ్మలబైలుకు చేరుకుని చెంచులపై కాల్పులకు తెగబడ్డారు. తన కోసం అమాయక చెంచులను చంపడాన్ని చూసి తట్టుకోలేక పెద్దబయన్న లొంగిపోవడంతో అక్కడే ఓ చెట్టుకు కట్టేసి 1938 ఏప్రిల్ 25న కాల్చిచంపారు.

● పెద్ద బయ్యన్న పోరాటం సాగిస్తున్న సమయంలోనే పూర్వ కర్నూలు జిల్లాలోని కొత్తపల్లిలో చెంచు యువకుడు హనుమంతప్ప కూడా ఉద్యమ బాట పట్టాడు. మెట్రిక్యులేషన్ చదివిన హనుమంతప్ప బ్రిటీష్ వారిని తరిమిట్టేందుకు చెంచులను సమీకరించి దళాలను సిద్ధం చేశాడు. ఈ క్రమంలోనే పెద్ద బయన్నతో చేతులు కలిపాడు. హనుమంతప్పను కూడా బ్రిటీష్ సైన్యం 1938 ఏప్రిల్ 25న చెట్టుకు కట్టి తూటాల వర్షం కురిపించింది. ఈ విప్లవ వీరుల గురించి సాహితీ సుధా ఫౌండేషన్ వారు తెలుగు రాష్ట్రాల్లో గిరిజన ఉద్యమాలు పుస్తకంలో ప్రస్తావించారు.



తుమ్మలబైలులో ఏర్పాటు చేసిన మన్యం వీరుల విగ్రహాలు

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో అరుదైన గౌరవం



కుడుముల పెద్ద బయ్యన్న(ఫైల్)



హనుమంతప్ప (ఫైల్)

బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన అదివాసీల చరిత్రను భారత ప్రభుత్వం గుర్తించింది. మద్రాస్ లైబ్రరీలో లభించిన ఆధారాలతో శ్రీశైలం ఐటీడీఏ అధికారులు నల్లమలకు చెందిన ఆదివాసీలు పెద్దబయ్యన్న, హనుమంతప్ప స్వాతంత్య్ర పోరాటం గురించి కేంద్రానికి నివేదించారు. దీంతో స్పందించిన కేంద్ర ప్రభుత్వం అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తుమ్మలబైలులో ఇద్దరి విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గిరిజన వీరుల విగ్రహాలు ఆవిష్కరించారు.

దాష్టీకాలపై కలమెత్తిన ఓరుగంటి

స్వాతంత్య్ర ఉద్యమంలో పశ్చిమ ప్రకాశానికి ఒక పేజీ ఉంది. మహనీయుల బాటలో నడిచిన వారిలో ఓరుగంటి వెంకట రమణయ్య ఒకరు. మాటల్లో మృదుత్వం, కళ్లలో కార్యదీక్ష, కలంలో నిజాయితీ ఉట్టిపడే వ్యక్తి మార్కాపురం ప్రాంత మొదటి జర్నలిస్టు ఓరుగంటి వెంకట రమణయ్య. స్వాతంత్య్రోద్యమంలో తన వంతు కర్తవ్యం నిర్వహించారు. 1917జూలై 1న మార్కాపురం పట్టణంలో జన్మించిన రమణయ్య 1932లో గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్తు బహిష్కరణ, పికెటింగ్, సత్యాగ్రహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వరాజ్య సముపార్జనలో భాగంగా రాజకీయ పాఠశాలలో పాల్గొని అయ్యదేవర కాళేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. స్వాతంత్య్ర సమరం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజుల్లో ఆయన పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో పలు పత్రికలకు రచనలు చేశారు. పత్రికలపై బ్రిటీష్ ప్రభుత్వం నిషేధం విధించిన సందర్భంలో పత్రిక ప్రతులను ఆయన ధైర్యంగా పశ్చిమ ప్రకాశం ప్రజలకు అందించి స్వాతంత్య్రోద్యమ విశేషాలను వివరించారు. తన చివరి రోజు వరకు ఖద్దరు దుస్తులే ధరించారు.



ఓవీ రమణయ్య (ఫైల్)

సాగర తీరం ఉద్యమ పాఠం

స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, యువతకు మార్గనిర్దేశం చేసేందుకు కొత్తపట్నంలోని రాజకీయ పాఠశాల వేదికైంది. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టులు సమష్టిగా ఎంతో మంది యువతకు ఆర్థిక, సామాజిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. వావిలాల గోపాలకృష్ణ, టంగుటూరి ప్రకాశం పంతులు, పుచ్చలపల్లి సుందరయ్య తదితరులు ఇక్కడ రాజకీయ పాఠాలు బోధించారు. బనారస్‌లో కమ్యూనిస్టు సిద్ధాంతాలపై శిక్షణ పొందిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకుడు పులుపుల శివయ్య రాజకీయ పాఠశాలకు సిలబస్ రూపొందించి, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. పాఠశాలలోని 180 మంది విద్యార్థులకు వ్యాయామ శిక్షణ, మిలిటరీ డ్రిల్, ఆత్మరక్షణ పద్ధతులపై చంద్ర రాజేశ్వరరావు శిక్షణ ఇచ్చారు.

కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ వద్ద సత్రంలో అన్నాప్రగడ కామేశ్వరరావు ఆధ్వర్యంలో 1937 మే 1న మొదలైన తరగతులను 40 రోజులపాటు నిర్వహించాలని భావించగా బ్రిటీష్ పాలకులు 15 రోజులకే అడ్డుతగిలారు. విద్యార్థులపై లాఠీలు ఝులిపించి అక్రమ కేసులు పెట్టారు.

పోరాటంలో పట్టభద్రుడు



అనుమాల అశ్వత్థ నారాయణ

జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన అనుమాల అశ్వత్థ నారాయణ స్వాతంత్య్ర సంగ్రామంలో చురుగ్గా పాల్గొన్నారు. బీఏబీఎల్ చదువుతూనే 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. నెల్లూరు సమీపంలో రైలు పట్టాలు తొలగించిన కేసులో బ్రిటీష్ సైన్యం అరెస్టు చేసి బళ్లారి జైల్లో బంధించింది. 1946లో నెల్లూరు నుంచి చెన్నై వరకు గాంధీజీతో కలిసి రైలులో ప్రయాణించిన ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు. ఉద్యమం కోసం తన 20 ఎకరాల పొలాన్ని విక్రయించి ఖర్చు చేశారు. కందుకూరు మండలం పలుకూరులోని తన సొంత స్థలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నారాయణ నిర్మించారు. 2022 మే 4న తన స్వగ్రామంలో కన్నుమూశారు.

అంతర్ జిల్లా గంజాయి ముఠా అరెస్టు

ఒంగోలు టౌన్: వారంతా హోటళ్లలో పనిచేసుకుంటూ, ఆటోలు నడుపుకుంటూ బతుకుబండిని సాగించేవారే. అయితే చెడు స్నేహాలతో మద్యానికి బానిసలయ్యారు. ఆర్థిక సమస్యలు అధిగమించేందుకు దొంగతనాలకు దిగారు. అడ్డదారిలో సంపాదించిన డబ్బులు జల్సాలకు సరిపోక గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని రాంగ్ రూట్‌లో ప్రయాణం చేయడం మొదలుపెట్టారు. చివరికి పోలీసులకు చిక్కి జైలు పాలయ్యారు. రూరల్ పోలీసు స్టేషన్లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ ఎన్. శ్రీకాంత్ వెల్లడించిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన పసుమర్తి లక్ష్మీ నారాయణ, కనిగిరి మండలం చాకిరాల గ్రామానికి చెందిన మల్లెల కొండారెడ్డి, ఒంగోలు ఇస్లాంపేటకు చెందిన షేక్ ఆరీఫ్, కనిగిరి పాతూరుకు చెందిన నాగులూరి బాలరాజు , చీమకుర్తి పట్టణానికి చెందిన కుంచాల అంకమ్మ రాజులను గుండ్లకమ్మ ఆర్చీ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కూలీ పనులు చేసుకునే నిందితులు జల్సాలకు అలవాటు పడ్డారు. గంజాయి విక్రయిస్తే అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చన్న ఆశతో విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి వద్ద 10 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. గంజాయిని పంచుకునేందుకు లక్ష్మీ నారాయణ, కొండారెడ్డిలు దొంగిలించిన మోటారు బైకుపై గుల్లాపల్లి గుండ్లకమ్మ ఆర్చీ వద్దకు చేరుకున్నారు. చేరో 5 కేజీల చొప్పున గంజాయిని పంచుకొని ఎవరికి వారు విక్రయించుకోవాలని ప్లాన్ చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయి, మోటారు బైకు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితుల వద్ద నుంచి రూ. లక్ష విలువైన 100 కేజీల రాగి ట్రాన్స్‌ఫార్మర్ వైరు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అంతర్ జిల్లా గంజాయి ముఠాను అరెస్టు చేసిన కేసులో రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్, మద్దిపాడు ఎస్సై వి. మహేష్, కేసును పర్యవేక్షించిన ఏఎస్పీ (క్రై) ఎస్‌వీ శ్రీధర్‌రావులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీకాంత్

దేశభక్తిని పెంపొందించుకోండి



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

● హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని, ముఖ్యంగా యువత దేశం పట్ల మరింత బాధ్యతగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. పేస్ కాలేజీ ఆధ్వర్యంలో బుధవారం చర్చి సెంటర్ నుంచి ఏర్పాటు చేసిన 700 మీటర్ల జాతీయ జెండా హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తిరంగా సెల్ఫీ పాయింట్‌లను, తిరంగా సిగ్నేచర్ క్యాంపెయిన్‌లు, తిరంగా యాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 700 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించడం సంతోషకరమన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని, దేశానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఉషారాణి, సెట్నల్ సీఈఓ లోకేశ్వరరావు, నోడల్ అధికారి రవికుమార్, పేస్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సుకు తప్పిన పెనుప్రమాదం

● విద్యార్థులు సురక్షితం

వెలిగండ్ల: మొగళ్లూరుపల్లి వద్ద స్కూల్ బస్సుకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు వెలిగండ్ల, సీఎస్పురం మండలాల నుంచి స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు స్కూల్ బస్సును సీఎస్‌పురం మండలం గోగులపల్లి, కొట్టాలపల్లి, మరపగుంట్ల, వెలిగండ్ల, మొగళ్లూరు మీదుగా కనిగిరికి నడుపుతున్నారు. స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులతో స్కూల్ బస్సు నిండిపోతుంది. విద్యార్థులను ఎక్కించుకొని కనిగిరికి వెళ్తుండగా మొగళ్లూరుపల్లి వద్ద ట్రాక్టర్ బస్సుకు ఎదురుగా రావడంతో బస్సు మార్జిన్ దిగింది. బస్సు మార్జిన్ దిగడంతో మార్జిన్‌లోకి టైర్లు దిగబడి పోయాయి. దీంతో బస్సు ఎడమవైపు వాలిపోయింది. బస్సు డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించి బ్రేక్ వేసి బస్సును నిలిపివేశాడు. మొగళ్లూరుపల్లి గ్రామస్తులు విద్యార్థులను బస్సులో నుంచి కిందికి దించివేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. బస్సు ఒరిగిన ప్రదేశం పక్కన 7 అడుగుల గుంత ఉంది. ఏమాత్రం డ్రైవర్ నిర్లక్ష్యంగా ఉన్నా బస్సు గుంతలో పడి ఉండేది. ఈ సంఘటనలో బస్సు పెనుప్రమాదాన్ని తప్పించుకుంది. విద్యార్థులు సురక్షితంగా ఉన్నారు.



ఒరిగిన బస్సు

మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు సాయం

ఒంగోలు టౌన్: జిల్లాలోని తాళ్లూరు పోలీసుస్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న 2012 బ్యాచ్‌కు చెందిన ఈ. పవన్ కుమార్ 2023 మేలో గుంటూరు జిల్లా తుళ్లూరు పరిధిలో బందోబస్తు నిర్వహిస్తున్న సమయంలో పాముకాటుకు గురై మరణించారు. ఈ క్రమంలో పవన్ కుటుంబాన్ని ఆదుకోవాలని అతడి మిత్రులు నిర్ణయించుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన సివిల్, ఏఆర్ పోలీసులు రూ.6,97,492లను సేకరించారు. 2009వ బ్యాచ్‌కు చెందిన పోలీసులు కూడా తమ వంతు సాయంగా రూ.1,05,000 సేకరించారు. మొత్తం రూ.8,02,492లను బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే పొదిలి పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ 2022 ఫిబ్రవరి 5న గుండెపోటుతో మరణించిన కె. శివరామకృష్ణ గౌడ్ కుటుంబానికి 2012 బ్యాచ్ పోలీసులు రూ.2,32,800 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన సహోద్యోగుల కుటుంబాలకు తోటి బ్యాచ్ ఉద్యోగులు ఆర్థికసాయంచేయడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబసభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, 2009, 2012 బ్యాచ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మరణించిన పోలీసు కుటుంబాలు, 2009-12 బ్యాచ్ పోలీసులతో ఎస్పీ దామోదర్

కాలువలో కాలు జారిపడి వ్యక్తి మృతి

కురిచేడు: నాగార్జునసాగర్ దర్శి బ్రాంచి కాలువలో స్థానిక బ్రిడ్జి వద్ద కాలుజారిపడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎస్ ఎస్ పి అగ్రహారం గ్రామానికి చెందిన కేసనపల్లి మరియబాబు(34) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరి బుధవారం కురిచేడు నుంచి దర్శికి వెళ్లి వచ్చిన తర్వాత సాయంత్రం సమయంలో కొంత మంది ఆటో డ్రైవర్లతో కలిసి కాలువ వద్దకు వచ్చి బహిర్భూమికి వెళ్లి కాలువలో దిగగ్గా కాలుజారి అందులో పడిపోయాడు. తోటి డ్రైవర్ల సోదరుడు లాజర్ అతన్ని కాపాడేందుకు ప్రయత్నించినా నీటిలో మునిగిపోయాడు. విషయం తెలియడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మరియబాబు మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతదేహం కోసం వెదుకుతున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కోల్ సొసైటీ చైర్మన్ సుబ్బారెడ్డి మృతి

ఒంగోలు సిటీ: ది గుంటూరు పొగాకు ఉత్పత్తిదారుల కో ఆపరేటివ్ సొసైటీ(కోల్ సొసైటీ)చైర్మన్ తాటిపర్తి సుబ్బారెడ్డి మంగళవారం రాత్రి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కోల్ సొసైటీకి సుబ్బారెడ్డి ఎంతో సేవలందించారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించడంతో పాటు పొగాకు రైతులను ఆదుకోవడం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. తాటిపర్తి సుబ్బారెడ్డి తండ్రి తాటిపర్తి చక్రారెడ్డి 1946లో ఈ సొసైటీని స్థాపించారు. 2012లో సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బారెడ్డి సొసైటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రెండేళ్ల క్రితం సొసైటీ పాత భవనాలను పడగొట్టి బహుళ అంతస్తుల కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈయన గతంలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన మురళీకృష్ణారెడ్డికి తండ్రి. సుబ్బారెడ్డి భౌతికకాయాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సందర్శించి నివాళులర్పించారు.



తాటిపర్తి సుబ్బారెడ్డి (ఫైల్)

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కొండపి (సింగరాయకొండ): విద్యుదాఘాతానికి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కొండపి గ్రామ శివారు పొలాల్లో జరిగింది. వివరాల్లోకి వెళితే..కొండపి పంచాయతీ దాసిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు కాటంరెడ్డి గురవారెడ్డి పొలంలో బోరుకు విద్యుత్ మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై కృష్ణ బాజీబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రిని తరలించారు.



గురువారెడ్డి మృతదేహం